


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### 'దూర్ కే చుట్టం....'

**సందానీగాడు ఆ రోజు** ఉషారుగా లాగూ పైకి ఎగదోసుకుంటూ, నెత్తినిండా చమురు రాసుకుని, ఎగురుకుంటూ బడికొచ్చాడు. మా అందరికీ మహా అంటే పదేళ్ళు వుంటాయి. ఎవరైనా శెలవలయ్యాక వచ్చి తాము  వెళ్ళి వచ్చిన ప్రదేశాల గురించో, చుట్టాల గొప్పలు గురించో  చెప్తుంటే నోరు తెరిచుకుని, చొంగ కారిపోతున్నా పట్టించుకోకుండా వినే వయసు. సినిమా చూసొస్తే, అదీ సూపర్ స్టార్ క్రిష్ణ జేమ్స్ బాండ్ సినిమానో, బ్లాక్ అండ్ వైట్‌లో విఠలాచార్య సినిమా చూసొస్తేనో సందానీకీ నాకూ అడ్డూ ఆపూ, వినే మా సాటి క్లాస్‌మేట్స్‌కి అలసటా, విరామం ఇచ్చేవాళ్ళం కాదు. వాడి చేతిలో ఒక కాయితం పొట్లం ఉంది. ఆ పొట్లం పట్టుకున్న చేతికి 'లబ్బరు వాచ్' అదీ పింక్ కలర్‌లో. కాళ్ళకి ఎప్పుడూ లేని విధంగా తెగిన చెప్పుల బదులు శాండిల్స్. వాడి మొహంలో విజయగర్వం.

"ఏంట్రా? ఎప్పటిలా కాకుండా తొందరగా వచ్చావు స్కూల్‌కి?" అని అడిగాను.

వాడు గబగబా "ఏ.వీ రమణీ.. ఇది చూడు మీ ఇంట్లో చేసుకునే కాఫీలాంటి చాక్లెట్" అని పొట్లంలోంచి ఒక కాఫీ టాఫీని నాకు అందించాడు. అది నోట్లో పెట్టుకుంటే నిజంగా అద్భుతంగా వుంది. కమ్మర్ కట్టీలూ, కమలా తొన పిప్పెర మెంట్లూ తినే మా స్టాండర్డ్‌కి అది ఫైవ్ స్టార్ లెవెల్ అప్పట్లో. నా పక్కనున్న శ్యామ్యూల్ గాడికీ ఎవెంజలీనాకీ, టీ.వీ హేమమాలినీకీ కూడా తలోటీ ఇచ్చి, గొప్పగా కాయితం అవతల పారేసాడు.

వాడి లెవెల్ అమాంతం మారిపోయింది. ఎన్నడూ లేనిది క్లాసులో ఫస్ట్ వచ్చే శామ్యూల్ గాడు, "నా పక్కన కూర్చోరా" అని ఫస్ట్ బెంచ్‌లో తన పక్కన చోటిచ్చాడు. ఎవెంజలీనా వాడి భుజం మీద చెయ్యివేసి "ఎవరిచ్చారురా?" అంది.

"ఇవేంట్రోయ్ కొత్త చెప్పులు?" అని అరిచేసాను.

"చెప్పులు కాదు నీకీ ఏమీ తెల్వద్. ఇవి శాండిల్స్. ఇంకా మా ఇంట్ల సాక్సులు బీ వున్నయి వీటి మీద ఏస్కోనికి" అన్నాడు సందానీ.

మొదటిసారి చంద్రమండలం మీదకి వెళ్ళొచ్చిన వ్యోమగామిని చూసినట్లు మేమంతా భక్తిగా వాడివైపు చూసాం. వాడు ప్రవచనం చెప్పే మేధావిలా అందరినీ చూసి నవ్వి "నాదీ దూర్ కీ మామా కువైట్ కెల్లి వచ్చినయ్.. మాకీ మస్తు ప్రెజెంట్స్ తెచ్చినయ్. మా బువాజీ సిల్క్ సీర కడ్తాయ్. బిల్‌కుల్ దూద్ మీద మీగడ లెక్క వుంటయ్ అయి" అన్నాడు.

నేను వెంటనే పాలమీగడలాంటి చీరలో నన్ను నేను వూహించుకున్నాను. ఏ పుస్తకం చదివినా, అందులో వర్ణనలొచ్చినప్పుడు నన్ను నేను వూహించుకోవడం ఆ వయసునుండే నాకు అలవాటు. ఏదో క్లాసులో ఒక కథ చదివి బుగ్గలు ఎర్రపడేలా సిగ్గుపడాలని అద్దం ముందు నిలబడి ప్రయత్నించి చివరకి ఎంతగా ఎర్రపడక కాస్త కుంకుమ రాసుకుని సిగ్గుపడ్డాను. ఇప్పుడూ అలాగే ఆ పాల మీగడ చీరలోని బువాజీని వూహించుకున్నాను.

"చేతికి వాచీ పెట్టుకుంటయ్" తన వాచీ మేం గమనించలేదని చూపిస్తూ అన్నాడు. కళ్ళకి అద్దం పెడ్తాయి. పెదవులకి గులాబీ రంగు వేస్తయ్"

అంత వేగంగా నేనూ నన్ను వూహించుకోలేక నేను అవస్థ పడ్తున్నాను.

"బువాకి చెప్పల్ రెండు, మూడు వందల జతలు వున్నయ్ అంట"

"అమ్మో!" మేం గుండెలమీద చేతులేసుకున్నాం.

చీరలు వంద వున్నాయి అంటేనే రాజకుమార్తె ఏమో అనుకునేవాళ్ళం. దిక్కుమాలిన చెప్పులు. తెగిపోతే కుట్టించుకో అక్కరలేకుండా అన్ని వందల జతలా? నమ్మలేకపోయాం.

"మీ బువా ఆ కువైట్ దేశానికి రాణి ఏంట్రా" అన్నాను.

"గట్లనే! మా మామకి గాడ నాలుగు కార్లు వున్నయ్."

"అవేంటి?" అయోమయం మొహం వేసాను.

"మోటర్ గాడీ...కార్" అన్నాడు.

"డ్రైవరా?" అన్నాను.

"సీ! సొంతం. ఆయన తాన ముగ్గురు డ్రైవర్లు పని చేస్తాయి" అన్నాడు.

అప్పటిదాకా మాకు తెలిసిన వాళ్ళెవరికీ అన్ని కార్లు.. అదే కార్లు లేవు. తెలుగు పండిట్ పదో క్లాస్ వాళ్ళకి రుగామాదేశ సంధిద్వారా గోపాలులు గోపాలురు అవును అని చెప్పడం విన్నాను. అలాగే కారులు, కార్లుగా, బర్రెలు బర్లుగా మారునని సందానీ వల్ల తెలిసింది. అసలు వాడు ఒక్కొక్క పూట కువైట్ మామ గురించి చెప్తుంటే గీత చెప్తుంటే క్రిష్ణుడు,

అర్జునుడు తల వంచి భూమిలోకి కుంచించుకుపోతూ విన్నట్లు మేం వింటున్నాం. వాడు క్రిష్ణావతారం లాస్ట్ సీన్‌లో ఎన్.టి.ఆర్‌లా తెర అంతా ఆక్రమించేస్తున్నాడు. అసలు ఇన్ని ఆశ్చర్యాలతో నోరు తెరిచీ తెరిచీ మా నోళ్ళు నెప్పొచ్చేస్తున్నాయి.

"మామా బ్లాక్ షూలో మొకం చూసుకోవచ్చు. గట్ల మెరుస్తయ్" పెద్దయ్యాక నేను కాదు అసలు వాడూ రచయిత అవ్వాల్సింది. హీరోల బిల్డప్ సీన్‌లు అంత బాగా రాయగలడు.

"ఆరడుగుల బుల్లెట్టూ" అని ఐదున్నర అడుగుల వాడిని లో ఏంగిల్ కెమేరా పెట్టి చూపించి అమ్మేయగల సామర్ధ్యం.

"అసలు బాషా ఎవరనుకున్నావ్? అతని పేరు చెపితే చాలు భూకంపం వచ్చినట్లు మనుషుల చేతిలో టీ గ్లాసు గడగడ వణికి అదే మిల్క్ షేక్ అయిపోతుంది" అన్న డైలాగ్స్ రాయగలడు.

ఈ విధంగా కువైట్ మామ తమ ఇంట్లోకి తెచ్చిన కెమేరా, అబ్బాజాన్‌కి తక్కువైనట్లు తెచ్చిన విస్కీ సీసా, సిగరెట్లూ, అమ్మీజాన్‌కి బంగారం కమ్మలూ, నెకిలీసు, బిస్కెట్లూ, చాక్లెట్లూ, అన్నీ తెగ వర్ణించి చెప్పాడు. ఆ రోజు మాకు కథా కాలక్షేపం బాగా జరిగింది.

క్రౌడ్ పుల్లర్ సందానీగాడు క్లాసులు డిస్టర్బ్ చేస్తున్నాడని మేత్స్ టీచర్ నీల్‌డౌన్ చేయించినా వాడు కొత్త శాండిల్స్ చూసుకుని మురుస్తూ నీల్ డౌన్ చేసాడు.

అ రోజు నేను మా అమ్మని ఆఫీస్ నుండి వచ్చాక "అమ్మా మనింటికి ఇంతమంది చుట్టాలు వస్తున్నారు కానీ ఒక్కళ్ళు కూడా నాకో చెమికీలీ గౌనో, నీకో నెకలీసు గొలుసో తేరేవిటే?" అని అడిగాను.

"చాల్లే పాపం. ప్రాణం మీదకొచ్చి ఆస్పత్రిలో చూపించుకోడానికి వచ్చే వాళ్ళూ, కొంపా గోడూ పోయి కోర్టుల చుట్టూ తిరగడానికొచ్చే వాళ్ళూ మనకి గౌన్లూ, నెక్‌లెసులూ తేవాలా? ఎవరు నేర్పిస్తున్నారు ఈ ముదర మాటలు?" అని తిట్టింది.

మాకు మాత్రం ఓ వారం రోజులపాటు సందానీ మామాజీ హాంగోవర్ తగ్గలేదు.

ఫారెన్ సిగరెట్టు, చేతపట్టి, విదేశీ 'చుక్క' వేసి, రోడ్లు మాత్రం దేశవాళీ పద్ధతిలోనో కొలుస్తూ, అటూ ఇటూ తూగుతు సందానీ అబ్బాజాన్ దర్శనం ఇచ్చాడు.

అమ్మీజాన్ మాత్రం వంటలు చేస్తూ, మర్యాదలు చేస్తూ అమ్మమ్మ దగ్గరకి ముచ్చట్లకి రాలేదు. సందానీగాడి బిజిలీ కొత్త గవ్వలు మెడకి కట్టుకుని ఎగుర్తుంటే, సందానీగాడు కొత్త శాండిల్సూ, సాక్సులూ తొడుక్కుని దానితో కలిసి నాటు పద్ధతిలో చిందులేసాడు.

నేను మా ఇంటిముందు సడెన్‌గా ఓ ఫారెన్ కారు వచ్చి ఆగకపోతుందా? అందులోంచి 'దూర్‌కీ మామా' మరీ కువైట్ అంత దూర్‌కీ మామా కాకపోయినా, బొంబాయి అంత 'దూర్' అయినా ఫర్లేదు. నల్ల గాగుల్స్ పెట్టుకుని, సూటూ

బూటూ వేసుకుని దిగకపోతాడా? వెనకాల పాలమీగడ కాకపోయినా పెరుగు మీద తరక రంగు చీరలో నైనా ఓ 'అత్త' రాకపోతుందా? మాకు బిస్కెట్లూ, చాక్లెట్లూ ఇవ్వకపోతుందా అని ఎదురు చూసాను.

అమ్మ ఫ్రెండ్ బుజ్జాయి అంటీ వచ్చింది. వస్తూ వస్తూ ఓ అరడజన్ చక్కరకేళీ అరటి పండ్లూ, సీవెండి క్యారేజీలో తను చేసిన రిబ్బన్ పకోడా తీసుకొచ్చింది. నాకైతే అవి కళ్ళకి ఆనలేదు. రిబ్బన్ పకోడీ తింటుంటే వాము వాసన వేస్తూ నోట్లో కరిగిపోయాయి కానీ, ఇంకేదో తెస్తే బావుండేది సందానీగాడికి చూపించుకోడానికీ, చెప్పుకోడానికీ అని మనసు ఆరాట పడింది.

"బీబీ అసలు బయటకే రావడంలేదే?" అని అమ్మమ్మ అడిగితే "దూర్‌కే భాయీ ఆయా కోవిటం కెల్లి రోజూ నీచులేనిదే ముద్దముట్టడు. సాయంత్రం ముందు వేస్తడు. దుకాన్‌కి వెళ్ళి తీస్కురావుడూ.. వండుడు, పెట్టుడు సరిపోతోంది పంతులమ్మా " అంది హడావిడిగా పరిగెడ్తూ సందానీ తల్లి.

ఇలా మటన్ కొట్టు దగ్గర నిలబడి, గుడ్లు కొనుక్కుని వస్తూ, చేపలు వాడితో బేరం ఆడుతూ బీబీ సిగరెట్లూ, సోడాసీసాలూ తెస్తూ సందానీ ఓ నెలరోజులు తీరిక లేకుండా గడిపారు.

"సీతత్తయ్య తొక్కుడు పచ్చడి తెచ్చిచ్చింది. ఎంత బావుందో చూడు.. వేసుకుంటావా?" అని అమ్మ వడ్డిస్తుంటే "నీకీ తొక్కుడు పచ్చడీ, సీవెండి క్యారేజీ ఫ్రెండ్స్ బ్యాచ్ తప్ప మంచి పాలమీగడలాంటి చీరలు కట్టుకునే ఫ్రెండ్స్ లేరా?" అని అరిచాను.

"ఏం మాటలే అవీ?" అని అమ్మ కోప్పడింది.

ఎండాకాలం మధ్యాహ్నం పూట, మజ్జిగలో వేసుకోడానికి దబ్బాకులు తెమ్మని, అమ్మమ్మ చిట్టత్తయ్య ఇంటికి పంపిస్తుంటే, సందానీనీ తోడు రమ్మందామని వాళ్ళ ఇంటికి వెళ్ళాను.సందానీగాడి కేకలూ, ఏడుపులూ వినిపిస్తున్నాయి. వాళ్ళ నాన్న వాడిని, వాడి కొత్త శాండిల్స్‌తో ఉతికేస్తున్నాడు వీపు మీద.

"బద్మాష్ సాలా కో మార్ దేతా హూ!" అంటున్నాడు ఏడుస్తూనే సందానీ.

"సువర్ కే ఔలాద్" అని మళ్ళీ కొడ్తున్నాడు వాళ్ళ నాన్న.

"ఠైరో.. బచ్చాకో మార్ దేతా క్యా మియా" అని సందానీ సవితి తల్లి వచ్చి అడ్డుపడి, సందానీని ఇవతలకి లాగి, వాళ్ళ నాన్న చేతిలోనుంచి శాండిల్ లాగి పారేసింది.

సందానీ పరుగున వెళ్ళి దండెం మీదున్న వాళ్ళ మామ సూట్‌లూ, షర్ట్‌లూ తీసుకొచ్చి బయటకి విసిరేస్తున్నాడు.

"ఏవైందిరా?" అని అడగబోయి, నోటమాట రాక పరుగు తీసాను.

సందానీ తల్లి నాకు ఎదురొచ్చింది. ఆవిడ ఏడుస్తోంది. చేతిలో నెకిలీసు గొలుసు.

లోపల సందానీని మళ్ళీ కొడ్తున్న వాళ్ళ నాన్న. అమ్మయ్యా వాళ్ళ అమ్మ వచ్చేసింది. అని ఆవిడ వెనకాలే వెళ్ళి తలుపు వెనకాల నక్కి చూసాను.

"నీకీ బిజిలీని కోసి బిరియానీ వడి పెట్టాలారా.. బద్మాష్" అని ఆవిడ అరుస్తూ అక్కడ స్టూల్ మీద కూచుని పెళ్ళాం చేత తలకి నూనె మర్దనా చేయించుకుంటున్న 'దూర్‌కి మామా' ని, ఉర్దూలో తిట్టి పోసింది. "కువైట్ నుండి ఇంతకాలానికి నా నాయిన వైపు సుట్టానివి వచ్చినావని చీటీ డబ్బులు పాడేసి  రోజూ నీచు కూరలూ, చేపలూ, గుడ్లూ వండి పెట్టానురా కుత్తా! నా మేకనే వండి పెట్టమంటావ్? నీకీ నీ పెళ్ళాంకీ మేపి మేపి అప్పుల పాలయినాం. నువ్వు తెచ్చిన నెకిలీసు ఇత్తడని మార్వాడీ సేట్ చెప్పిండు. బిజిలీ నీలాంటి సోమరి పోతుల నోట్ల బిరియానీ కాదురా మా అందరికీ బిడ్డ. రేపు మమ్మల్ని పాలు ఇచ్చి పెంచే తల్లి. అని సందానీ తల్లి, మామానీ అతని పెళ్ళాంనీ తిట్టి, తక్షణం అవతలకి పోండి అని తరిమేసింది.

సందానీ బిజిలీ గొంతు కౌగలించుకుని ఏడుస్తున్నాడు. వాడి బుగ్గల మీద ఏడుపు చారలు. వీపు మీద 'శాండిల్' ముద్రలు.

తండ్రి తాగిన మైకంలో ఇద్దరు పెళ్ళాలనీ బూతులు తిడ్తున్నాడు.

"నీకు నాలుగు కాళ్ళు వున్నాయా? సస్తే శవాలని తీసుకుపోయే స్ట్రెచర్ నూకుతావుట కదా కొవిటంల. ఆ సేట్ బావమరిది నీకీ చూసి గుర్తుపట్టి చెప్పిండు. తనూ ఆ ఆస్పత్రిలనే పని చేస్తుండు. పని చెయ్యడు తప్పు కాదురా. చిన్నదైనా పెద్దదైనా పని మానేసి మంది కొంపల మీద పడి మేసుడూ, వాళ్ళని అప్పుల పాలు సేయుడూ తప్పు" అని "లే.. లెయ్..పో నా ఇంట్లకెల్లి" అని అరిచింది సందానీ తల్లి.

"నీ మేకని కొయ్యమన్నందుకే ఇంత గుస్సా అయితవా ఆపా?" అన్నది దూర్ కె బువా.

"అది మేకకాదు నా బిడ్డ" శివంగిలా గర్జించింది బీబీ. దాంతో మొగుడ్ని "పద పద.. నా ఆపా ఆపా ని వచ్చినవే. సూడు ఏమైందో?" అని తిడ్తూ కింద పడ్డ బట్టలు సూట్‌కేస్‌లో సర్దుకుంటోంది బువా.

సందానీ తల్లి సందానీగాడినీ బిజిలీనీ రెండు చేతులతో దగ్గరకి తీసుకుంది.

'నా చుట్టాలు చాలు నాకు. మంచి వాళ్ళు' అనుకుంటూ నేను దబ్బాకుల కోసం చిట్టత్తయ్య ఇంటికి పరిగెత్తాను.

Post your comments







